క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption
15 ANNIVERSARY
హైదరాబాద్
5-5-2025
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 32
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

# మెట్రో బాదుడు 5000 కోట్లు

## చార్జీల పెంపునకు సిద్ధం


40 శాతం వరకు పెరిగే ఛాన్స్.
గరిష్ట చార్జీ రూ. 100 చేసే యోచన.
గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన రేవంత్ సర్కార్.
రూ. 6,500 కోట్ల నష్టాల్లో మెట్రో.
నష్టాల భర్తీ కే పెంపు అంటున్న ఎల్ అండ్ టీ.

హైదరాబాద్ నగర ప్రజలపై చార్జీల భారం మోపేందుకు మెట్రో రైల్ సిద్ధమైంది. అతి త్వరలో మెట్రో చార్జీల పెంపు ద్వారా ప్రస్తుతం కంటే సుమారు 5000 కోట్ల అదనపు ఆదాయం రాబట్టేందుకు ఎల్ అండ్ టీ సిద్ధమైనట్లు తెలుస్తోంది. వరుస నష్టాలను అధిగమించేందుకు చార్జీల పెంపు అనివార్యంగా మారినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం రూ. 6,500 కోట్ల నష్టాలతో నగరంలో మెట్రో రైళ్లు నడుస్తున్నట్లు సంస్థ చెబుతోంది. రాష్ట్రంలో ఫ్రీ బస్సు అమల్లోకి వచ్చినప్పటి నుంచి ప్రయాణీకుల రాకపోకల్లోనూ హెచ్చుతగ్గులు నమోదవుతున్నట్లు తెలుస్తోంది. సగటున 5 లక్షల మంది ప్రయాణిస్తున్నట్లు అంచనా ఉన్నప్పటికీ 4.8 లక్షల మంది ప్రయాణికులు మాత్రమే రాకపోకలు సాగిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో నష్టాల నివారణకు చార్జీల పెంపే ఏకైక మార్గంగా సంస్థ ముందుకెళుతోంది.

తెలంగాణ బ్యూరో, క్రైమ్ మిర్రర్



2లో



# పాక్‌కు మరో జలక్

## పాకిస్థాన్ గొంతు ఎండేలా భారత్ మరో నిర్ణయం

బగలిహార్ నుంచీ నీళ్ల నిలిపివేత
పంజాబ్ ప్రావిన్సుకు ఇక కష్టమే
భారత్ నౌకలపై దాయాది దేశం నిషేధం
వాయుసేనతో ఘర్షణ జరగొచ్చన్న పాక్ మంత్రి

దిల్లీ: పాకిస్థాన్‌ను అన్నివైపుల నుంచి దిగ్బంధించడంలో భాగంగా భారత్ మరో నిర్ణయం తీసుకుంది. సింధునది జలాలను అడ్డుకోవడం ద్వారా ఇప్పటికే పొరుగుదేశాన్ని ఉక్కిరిబిక్కిరి చేయగా తాజాగా.. బగలిహార్ జలాశయం నుంచి నీటి సరఫరాను భారత్ నిలిపివేసింది. ఇది జమ్మూలోని రాంబన్‌లో చినాబ్ నదిపై ఉంది. విద్యుదుత్పత్తికి ఉద్దేశించిన ప్రాజెక్టు నుంచి నీటిని వదలకపోవడం వల్ల పాక్‌లోని పంజాబ్ ప్రావిన్సుకు సాగునీరు నీరందడం లేదు. ఉపగ్రహ చిత్రాలు దీనిని ధ్రువీకరిస్తున్నాయి. ఝీలం నదిపై ఉన్న కిషన్‌గంగ జలాశయం నుంచి కూడా నీటిని పాక్‌కు వెళ్లనివ్వకుండా అడ్డుకోవాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతను పెంచే మరిన్ని పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. భారత్ తమపై 36 గంటల్లో దాడిచేయడం ఖాయమంటూ నాలుగు రోజుల క్రితం గగ్గోలుపెట్టిన పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్.. భారత్ నుంచి ఆ వ్యవధిలో ఎలాంటి ప్రతిదాడి లేకపోవడంతో ఇప్పుడు కొత్త పల్లవి అందుకున్నారు. భారత వాయుసేనతో ఘర్షణ జరిగే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయని ఒక ఇంటర్వ్యూలో చెప్పారు.

2లో

## గత ప్రభుత్వం దక్షిణ తెలంగాణకు చేసిన అన్యాయం స్పష్టంగా కనిపిస్తోంది: మంత్రి ఉత్తమ్ కుమార్



మిర్యాలగూడలో ఉమ్మడి నల్గొండ జిల్లా అధికారులతో మంత్రి ఉత్తమ్ సమీక్ష
ఎస్సెల్బీసీ ప్రాజెక్టు పూర్తి, కందమల్ల పునఃప్రారంభంపై హామీ
గత ప్రభుత్వం కాళేశ్వరంపైనే దృష్టి పెట్టిందన్న ఉత్తమ్



## బాంబుల మోత తప్పదు.. హూతీలకు నెతన్యాహు హెచ్చరిక

టెల్ అవీవ్: యెమెన్‌కు చెందిన హూతీ తిరుగుబాటుదారులు క్షిపణిదాడికి

2లో

## జస్టిస్ ఎంజీ ప్రియదర్శిని కన్నుమూత

కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న జడ్జి
నేడు జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో అంత్యక్రియలు



## ప్రశాంతంగా ముగిసిన నీట్ యూజీ-2025

ఫిజిక్స్ అత్యంత సంక్లిష్టం..
జేఈఈ మెయిన్ స్థాయి దాటి ప్రశ్నలు
బయాలజీ సులువు, కెమిస్ట్రీ మధ్యస్తం
గతేడాదితో పోలిస్తే చాలా కఠినంగా ప్రశ్నాపత్రం

అమరావతి: నీట్ యూజీ%-%2025 ప్రశ్నాపత్రం కఠినంగా ఉందని విద్యార్థులు అభిప్రాయపడ్డారు. ఫిజిక్స్ విభాగంలో అత్యంత సంక్లిష్టంగా, బయాలజీలో సులువుగా, కెమిస్ట్రీలో మధ్యస్తంగా ప్రశ్నలు ఉన్నాయని వెల్లడించారు. 2025%-%26 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్, బీడీఎస్, ఇతర వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన నీట్ యూజీ పరీక్షను ఆదివారం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహించింది.



2లో



## గతంలో కాంగ్రెస్ తప్పులు చేసింది

అప్పట్లో నేను లేను.. అయినా పార్టీ చరిత్రలో జరిగిన తప్పులన్నింటికీ సంతోషంగా బాధ్యత వహిస్తా

సిక్కు వ్యతిరేక అల్లర్లపై ఓ సిక్కు విద్యార్థి ప్రశ్నకు రాహుల్ జవాబు
గత నెల అమెరికాలో బ్రౌన్‌వర్సిటీలో విద్యార్థులతో ముఖాముఖి
1980లలో జరిగింది తప్పు అని ఇప్పటికే పలుమార్లు బహిరంగంగా చెప్పానని రాహుల్ వెల్లడి

## పరీక్షలు జరపాలని విద్యార్థులు ప్రభుత్వాన్ని వేడుకునే దుస్థితి వచ్చింది: హరీశ్ రావు

పరీక్షల ఆలస్యంపై హరీశ్‌రావు ఆవేదన
పరీక్షల జాప్యంతో విద్యార్థులకు అర్హత నష్టం జరుగుతోందని ఆందోళన
ప్రభుత్వ వైఖరి విద్యార్థులకు శాపంగా మారిందని విమర్శ

రాష్ట్రంలో విద్యార్థులకు సంబంధించిన సమస్యల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ప్రభుత్వ వైఖరి కారణంగా విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి వెళుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పరీక్షలు జరపాలని విద్యార్థులు ప్రభుత్వాన్ని వేడుకునే దుస్థితి వచ్చిందని ఆవేదన వెలిబుచ్చారు. పరీక్షలు



## జస్టిస్ ఎంజీ ప్రియదర్శిని కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్/చందానగర్: తెలంగాణ హైకోర్టు న్యా యమూర్తి మాటూరి గిరిజాప్రియదర్శిని (61) కన్నుమూశా రు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె హైదరాబాద్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు తుదిశ్వాస విడిచారు. సోమవారం మధ్యాహ్నం జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె హఠాన్మరణం పట్ల న్యాయవాద వర్గాల్లో తీవ్ర విషాదం నెలకొంది. హైకోర్టు న్యాయమూర్తులు, న్యా యవాదులు, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు. విశాఖకు చెందిన నాగరత్నం %-% మారుతి అప్పారావు గిరిజాప్రియదర్శిని తల్లిదండ్రులు.మారుతి అప్పారావు తెలంగాణలో వాణిజ్య పన్నుల శాఖ అధికారిగా పనిచేశారు. నాగరత్నం గృహిణి. గిరిజాప్రియదర్శిని ఇంటర్ పూర్తి కాగానే కె.విజయ్‌కుమార్‌ను వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు నిఖిల్, అఖిల్. వివాహం తర్వాత కూడా ఆమె చదువును కొనసాగించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి సోషియాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్‌లో పీజీ పూర్తి చేశారు. విశాఖపట్నం ఎన్‌బీఎం న్యాయ కళాశాల నుంచి ఎల్ఎల్‌బీ, ఆంధ్ర వర్సిటీ నుంచి ఎల్ఎల్ఎం పూర్తి చేశారు. ఎల్ఎల్ఎంలో అత్యధిక మార్కులతో తొలి స్థానం సాధించారు. 1995లో ఏపీ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. పి.ఉమాబాల వద్ద జూనియర్‌గా ప్రాక్టీస్ ప్రారంభించారు. సివిల్, క్రిమినల్, లేబర్, కుటుంబ సంబంధిత కేసుల్లో వాదనలు వినిపించారు.

## బాంబుల మోత తప్పదు.. హూతీలకు నెతన్యాహు హెచ్చరిక

టెల్ అవీవ్: యెమెన్‌కు చెందిన హూతీ తిరుగుబాటుదారులు క్షిపణిదాడికి పాల్పడటంపై ఇజ్రాయెల్ తీవ్రంగా స్పందించింది. హూతీలు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు హెచ్చరించారు. ప్రతిదాడులు ఈసారి సాధారణంగా ఉండబోవని, కోలుకోలేని దెబ్బతీస్తామని అన్నారు. ఈ మేరకు ఆయన వ్యక్తిగత ఎక్స్ ఖాతాలో ఓ వీడియో పోస్టు చేశారు. "కచ్చితంగా ఎదురుదెబ్బ తీస్తాం. గతంలో ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ (ఐడీఎఫ్) దాడులను హూతీలు గుర్తుపెట్టుకోవాలి. గతంలో మా సంగతి వాళ్లకు రుచి చూపించాం. భవిష్యత్‌లోనూ చూపిస్తాం. ఈసారి దాడులు మామూలుగా ఉండవు. బాంబుల మోతలు హోరెత్తుతాయి" అని నెతన్యాహు అన్నారు. అంతకుముందు, ఇజ్రాయెల్ రక్షణశాఖ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ కూడా ఈ ఘటనపై స్పందించారు. ఇరాన్ మద్దతుతో దాడులకు తెగబడుతున్న హూతీలకు సరైన బుద్ధి చెబుతామన్నారు. ఎవరైనా తమకు హాని కలిగిస్తే.. అంతకు ఏడురెట్లు దెబ్బతీస్తామన్నారు. యెమెన్‌ను ఆవాసంగా మలచుకున్న హూతీ తిరుగుబాటుదారులు ఆదివారం ఉదయం ఇజ్రాయెల్‌పైకి బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించిన సంగతి తెలిసిందే. ఆ దేశంలోనే కీలకమైన బెన్ గురియన్ విమానాశ్రయ ప్రధాన టెర్మినల్ సమీపంలో ఈ క్షిపణి కూలిపోయింది. ఘటనా స్థలిలో దాదాపు 25 అడుగుల లోతైన గొయ్యి ఏర్పడింది. క్షిపణి రాకను ముందే గ్రహించామని, అయితే, దానిని కూల్చివేసేందుకు తాము చేసిన ప్రయత్నాలు ఫలించలేదని ఐడీఎఫ్ వెల్లడించింది. అయితే, ఆ క్షిపణి విమానాశ్రయ టెర్మినల్‌ను తాకకుండా నిరోధించగలిగామని తెలిపింది. తాజా ఘటనతో యెమెన్ కేంద్రంగా పని చేస్తున్న హూతీలు, ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తారస్థాయికి చేరాయి.

## గతంలో కాంగ్రెస్ తప్పులు చేసింది

(మొదటి పేజీ తరువాయి)

న్యూఢిల్లీ, మే 4: కాంగ్రెస్ పార్టీ అనేక తప్పులు చేసిందని, అయితే, అప్పుడు తాను లేనని, అయినప్పటికీ కాంగ్రెస్ చరిత్రలో జరిగిన తప్పులన్నింటికీ తాను సంతోషంగా బాధ్యత వహిస్తానని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పారు. 1984 సిక్కు వ్యతిరేక అల్లర్లు, సిక్కులతో కాంగ్రెస్ పార్టీ సంబంధాలపై అడిగిన ప్రశ్నకు రాహుల్ ఈ విధంగా సమాధానం ఇచ్చారు. 1980లలో జరిగినది 'తప్పు' అని తాను బహిరంగంగానే చెప్పానన్నారు. గతనెల 21న అమెరికాలోని బ్రౌన్ యూనివర్సిటీలో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ వీడియోను తాజాగా వాట్సన్ ఇనిస్టిట్యూట్ ఫర్ ఇంటర్నేషనల్ అండ్ పబ్లిక్ అఫైర్స్ శనివారం యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసింది. ఈ ముఖాముఖిలో 1984 నాటి సిక్కు వ్యతిరేక అల్లర్లను ఒక సిక్కు విద్యార్థి ప్రస్తావించాడు. సిక్కులతో సయోధ్య కోసం ఏం ప్రయత్నాలు చేస్తున్నారని రాహుల్‌ను ప్రశ్నించాడు. భారత్‌లో సిక్కులను తలపాగా ధరించనివ్వాలా? వద్దా? అనే అంశంపై తాను పోరాడుతున్నానని గతంలో అమెరికాకు వచ్చినప్పుడు రాహుల్ చెప్పారని కూడా ఆ విద్యార్థి గుర్తుచేశాడు. దీనిపై రాహుల్ స్పందిస్తూ.. 'ఏదైనా సిక్కులను భయపెడుతుందని నేను అనుకోవడం లేదు.అప్పుడు నేను చేసిన ప్రకటన ఏమిటంటే.. ప్రజలు తమ మతాన్ని వ్యక్తం చేయడంలోఅసౌకర్యానికి గురవుతున్న భారతదేశం మనకు కావాలా? అని. కాంగ్రెస్ పార్టీ చేసిన తప్పుల విషయానికి వస్తే.. నేను లేనప్పుడు ఎన్నో తప్పులు జరిగాయి. అయినా, చరిత్రలో కాంగ్రెస్ పార్టీ చేసిన తప్పులన్నింటికీ నేను సంతోషంగా బాధ్యత వహిస్తాను. నేను ఎన్నోసార్లు స్వర్ణ దేవాలయానికి వెళ్లాను. భారతదేశంలో సిక్కులతో నాకు చాలా మంచి, ప్రేమపూర్వక సంబంధాలు ఉన్నాయి' అన్నారు.

### పశ్చాత్తాపం పూర్తిగా ఉండాలి:బీజేపీ

1984లో జరిగిన సిక్కుల వ్యతిరేక అల్లర్లు తప్పేనని రాహుల్‌గాంధీ నిజంగా భావిస్తున్నట్లైతే, అందుకు బాధ్యత వహించేందుకు ఆయన సిద్ధంగా ఉన్నట్లైతే జగదీశ్ టైట్లర్, కమల్‌నాథ్, శ్యామ్ పిట్రోడాలను కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరించాలని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ఆర్‌పీ సింగ్ డిమాండ్ చేశారు.

# మెట్రో బాదుడు 5000 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ నగర ప్రజలపై చార్జీల భారం మోపేందుకు మెట్రో రైల్ సిద్ధమైంది. అతి త్వరలో మెట్రో చార్జీల పెంపు ద్వారా ప్రస్తుతం కంటే సుమారు 5000 కోట్ల అదనపు ఆదాయం రాబట్టేందుకు ఎల్ అండ్ టీ సిద్ధమైనట్లు తెలుస్తోంది. వరుస నష్టాలను అధిగమించేందుకు చార్జీల పెంపు అనివార్యంగా మారినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం రూ. 6,500 కోట్ల నష్టాలతో నగరంలో మెట్రో రైళ్లు నడుస్తున్నట్లు సంస్థ చెబుతోంది. రాష్ట్రంలో ఫ్రీ బస్సు అమల్లోకి వచ్చినప్పటి నుంచి ప్రయాణికుల రాకపోకల్లోనూ హెచ్చుతగ్గులు నమోదవుతున్నట్లు తెలుస్తోంది. సగటున 5 లక్షల మంది ప్రయాణిస్తున్నట్లు అంచనా ఉన్నప్పటికీ 4.8 లక్షల మంది ప్రయాణికులు మాత్రమే రాకపోకలు సాగిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో నష్టాల నివారణకు చార్జీల పెంపే ఏకైక మార్గంగా సంస్థ ముందుకెళుతోంది.

### 40 శాతం పెరిగే చాన్స్...

2017 నవంబర్ నుంచి దశలవారీగా మెట్రో రైలు సేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. అప్పటి నుంచి 2024 - 25 ఆర్థిక సంవత్సరం ముగిసే వరకు మెట్రో రైలు నష్టాలు రూ. 6,500 కోట్లకు చేరాయని సంస్థ చెబుతోంది. స్టేషన్లు, మాల్స్ లో రిటైల్ స్పేస్ లీజు, ప్రకటనలతో ఆదాయ మార్గాలను మెరుగు పరుచుకోవడానికి నిరంతర ప్రయత్నాలు చేస్తున్నా సంస్థ నష్టాలు భరించలేని స్థాయికి చేరాయంటోంది. కోవిడ్ తో తీవ్రంగా నష్టపోయామని మెట్రో రైలు చార్జీలను సవరించాలని ఎల్ అండ్ టీ మెట్రో 2022 లోనే రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. అప్పట్లో కేసీఆర్ సర్కారు ఫేర్ ఫిక్సేషన్ కమిటీ ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరింది. దీంతో కేంద్ర ప్రభుత్వం మెట్రో రైల్వే ( ఆపరేషన్ అండ్ మెయింటెయినెన్స్ యాక్ట్ 2022 ) సెక్షన్ 33, 34 ప్రకారం కమిటీ ఏర్పాటు చేసింది. ప్రయాణీకుల అభ్యంతరాలను పరిశీలించి చార్జీలను సవరించాలని సిఫార్సు చేసింది. కానీ అప్పటి ప్రభుత్వం చార్జీల పెంపునకు సుముఖంగా లేకపోవడంతో వాయిదా పడింది. నష్టాలు ఏటా పెరుగుతుండటం, ఇటీవల బెంగుళూరులో మెట్రో చార్జీలు 44 శాతం పెరగడంతో హైదరాబాద్ మెట్రో సైతం చార్జీల పెంపునకు సిద్ధపడినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మెట్రో నష్టాలపై ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు తెలియజేస్తూనే చార్జీల పెంపు కోసం అనుమతిని కోరారు. ఈ క్రమంలోనే తాజాగా ప్రభుత్వం నుంచి సూత్రప్రాయంగా అనుమతి లభించినట్లు తెలిసింది. ప్రస్తుతం కనిష్ట చార్జీ రూ. 10, గరిష్ట చార్జీ రూ. 60 గా ఉన్నాయి. అయితే దీనిని కనిష్ట చార్జీ రూ. 20, గరిష్ట చార్జీ రూ. 100 కు పెంచనున్నట్లు తెలుస్తోంది.



### మెట్రో పై మహాలక్ష్మి ఎఫెక్ట్...

సిటీ బస్సుల్లో మహాలక్ష్మి పథకం కింద ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించడంతో చాలా మంది మహిళలు దానివైపే మొగ్గు చూపుతున్నారు. విద్యార్థినులు, ఉద్యోగినులు సైతం మెట్రో నుంచి సిటీ బస్సుల వైపు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. ఎల్ బీ నగర్, మియాపూర్, నాగోల్ కారిడార్ లలో ప్రయాణీకుల రద్దీ ఉన్నా జేబీఎస్, ఎంజీబీఎస్ రూట్ లో మహిళా ప్రయాణీకుల సంఖ్య రోజురోజుకూ పడిపోతోంది. ఈ క్రమంలో నష్టాలను ఎదుర్కొనేందుకు చార్జీల పెంపు మినహా మరో గత్యంతరం కనిపించడం లేదని మెట్రో చెబుతోంది. చార్జీలు ఏ మేరకు పెరగనున్నాయనే అంశంపై కొద్ది రోజుల్లోనే క్లారిటీ రానుంది.

## ప్రశాంతంగా ముగిసిన నీట్ యూజీ-2025

(మొదటి పేజీ తరువాయి)

జాతీయ స్థాయిలో 22.7 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, దేశంలో 552, దేశం వెలుపల 14 నగరాలు, పట్టణాల్లో పరీక్ష రాశారు. రాష్ట్రంలో నీట్ ప్రశాంతంగా ముగిసింది. గతేడాది పేపర్ లీక్, అవకతవకలు చోటు చేసుకున్న నేపథ్యంలో పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీలు చేశాకే కేంద్రాల్లోకి అనుమతించారు. గతేడాదితో పోలిస్తే ఈ సారి ప్రశ్నాపత్రం చాలా కఠినంగా ఉందని నిపుణులు స్పష్టం చేశారు. గతేడాది జాతీయ స్థాయిలో 17 మంది విద్యార్థులు 720కు 720 స్కోర్ చేశారు. ఈ దఫా 720కు 720 స్కోర్ చేసే అవకాశం ఏ మాత్రం లేదంటున్నారు. మొత్తంగా ప్రశ్నాపత్రం సరళి గతానికి పూర్తి భిన్నంగా ఉందని మెజారిటీ అభిప్రాయం వ్యక్తమైంది. 2016, 2017ల్లో ఈ తరహాలో ప్రశ్నాపత్రం సరళి ఉందని కొందరు చెప్పారు.

### విద్యార్థులను నిరుత్సాహపరిచిన ఫిజిక్స్

ఈ దఫా ఫిజిక్స్ విభాగం విద్యార్థులను పూర్తిగా నిరుత్సాహపరిచిందనే చెప్పాలి. జేఈఈ మెయిన్స్ స్థాయిలో ఈ విభాగంలో ప్రశ్నలు ఉన్నాయి. సాధారణంగా కోచింగ్ సెంటర్లలో కూడా ఈ తరహా ప్రశ్నలు బోధించరని, మాక్ టెస్ట్‌లలోనూ ఉండవని తెలిసింది. గతేడాది ఫిజిక్స్ విభాగంలో ఏడు ప్రశ్నలు థియరీ విధానంలో జవాబులు గుర్తించేలా ఉన్నాయి. ఈ సారి థియరీ ఆధారంగా జవాబులిచ్చే ప్రశ్నలు ఒక్కటి కూడా లేవని సబ్జెక్ట్ నిపుణులు వెల్లడించారు. సుదీర్ఘమైన ప్రశ్నలు, ప్రతి దానికీ ప్రాబ్లమ్ సాల్వ్ చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.దీంతో ఫిజిక్స్ ప్రశ్నలకు సమాధానాల కోసమే విద్యార్థులు ఎక్కువ సమయం తీసుకున్నారని వివరించారు. ముఖ్యంగా 10 ప్రశ్నలు ఎంతో ప్రతిభ కలిగిన విద్యార్థులూ జవాబు ఇవ్వడానికి వీల్లేకుండా ఉన్నాయన్నారు. దీంతో మెజార్టీ విద్యార్థులు ఈ 10 ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా ఉండటం/తప్పు సమాధానం ఇవ్వడం చేసి ఉంటారని పేర్కొన్నారు. కెమిస్ట్రీలో ఎన్‌సీఈఆర్‌టీ స్థాయిని దాటి ప్రశ్నలు ఉన్నాయని చెబుతున్నారు.ఒక ప్రశ్నకు సమాధానంగా రెండు ఆప్షన్‌లు ఉంటాయని సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్స్ పేర్కొంటున్నారు. బయాలజీలో ప్రశ్నలు ఎన్‌సీఈఆర్‌టీ పరిధిలోనే వచ్చాయని, దీంతో ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌లో ప్రావీణ్యం సాధించిన విద్యార్థులు సులువుగా సమాధానాలిచ్చారని పేర్కొంటున్నారు. పేపర్ కఠినంగా ఉన్న క్రమంలో గతేడాదితో పోలిస్తే కటాఫ్‌లు బాగా తగ్గే అవకాశ ఉందని కోచింగ్ సెంటర్ల నిపుణులు అభిప్రాయపడ్డారు.

## గత ప్రభుత్వం దక్షిణ తెలంగాణకు చేసిన అన్యాయం స్పష్టంగా కనిపిస్తోంది: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



ఎస్సెల్బీసీ (శ్రీశైలం ఎడమ గట్టు కాలువ) సొరంగ మార్గం ప్రాజెక్టును ఎలాగైనా పూర్తి చేస్తామని, నిలిచిపోయిన కందమల్ల ప్రాజెక్టు పనులను తిరిగి ప్రారంభిస్తామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. మిర్యాలగూడలో ఆయన ఉమ్మడి నల్గొండ జిల్లా అధికారులతో సాగునీటి ప్రాజెక్టులపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం కాళేశ్వరం ప్రాజెక్టుపైనే అధికంగా దృష్టి సారించిందని, దీనివల్ల దక్షిణ తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. ఎస్సెల్బీసీ, దేవాదుల వంటి ప్రాజెక్టులను పూర్తి చేయడంలో గత పాలకులు విఫలమయ్యారని ఆయన విమర్శించారు. అంతేకాకుండా, పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా ప్రాజెక్టుల విషయంలోనూ తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.తమ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సాగునీటి ప్రాజెక్టులకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇందులో భాగంగానే ఈ ఏడాది రాష్ట్ర బడ్జెట్‌లో సాగునీటి రంగం కోసం ప్రత్యేకంగా రూ.23 వేల కోట్ల రూపాయలను కేటాయించినట్లు ఆయన గుర్తుచేశారు. ఈ నిధులతో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాతో పాటు దక్షిణ తెలంగాణలోని ఇతర జిల్లాల సాగునీటి అవసరాలు తీర్చడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు.

## పాక్‌కు మరో జలక్

తమ గగనతలంలోకి వచ్చేందుకు ప్రయత్నించిన రఫేల్ యుద్ధ విమానాలను అడ్డుకున్నట్లు ఆయన చెప్పుకొచ్చారు. కాలం గడిచేకొద్దీ భారత్‌తో ఘర్షణలు పెరుగుతాయేగానీ, తగ్గవని అభిప్రాయపడ్డారు. రష్యాలోని పాక్ దౌత్యవేత్త మహమ్మద్ ఖలీద్ జమాలీ మరోసారి అణు బూచిని భారత్‌కు చూపించి బెదిరించే యత్నం చేశారు. ఒకవేళ న్యూదిల్లీ తమపై దాడిచేస్తే.. అణ్వాయుధాలు సహా పూర్తిశక్తిని వినియోగిస్తామని రష్యా ఛానల్ ఆర్‌టీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. "ఇటీవల లీకైనట్లు చెబుతున్న పత్రాల ప్రకారం కొన్నిచోట్ల కచ్చితంగా భారత్ దాడులు చేయబోతున్నట్లు తెలిసింది. యుద్ధం వస్తే మా సంప్రదాయ, అణు బలంతో పూర్తిస్థాయిలో స్పందిస్తాం" అని చెప్పారు.

భారతదేశ నౌకల్ని రానివ్వం

పాక్ నుంచి ప్రత్యక్ష, పరోక్ష దిగుమతులపై నిషేధం విధిస్తూ నౌకల రాకపోకలపైనా భారత్ ఆంక్షలు విధించగా పాకిస్థాన్ కూడా అలాంటి నిర్ణయం తీసుకుంది. భారత జెండా ఉన్న నౌకలు తమ ఓడరేవులను ఉపయోగించుకోవడాన్ని నిషేధిస్తున్నట్లు ప్రకటించింది. భారత్ నుంచి దిగుమతి చేసుకునే పలు వస్తువులపైనా నిషేధం విధిస్తున్నట్లు తెలిపింది. పాక్ నౌకలు భారత్‌లోని రేవులకు వెళ్లడానికి వీల్లేదని ఆంక్షలు విధించారు.

### ప్రధాని మోదీతో ఎయిర్ చీఫ్ మార్షల్ భేటీ

ప్రధాని నరేంద్ర మోదీతో ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ భేటీ అయ్యారు. నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేశ్ కె త్రిపాఠి భేటీ అయిన ఒకరోజు వ్యవధిలోనే ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. నియంత్రణ రేఖ వద్ద దాయాది సైన్యం వరుసగా పదోరోజు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి కవ్వింపు చర్యలకు పాల్పడింది. కుప్వారా, బారాముల్లా, పూంఛ్, రాజౌరి సెక్టార్లలో పాక్ రేంజర్లు కాల్పులు జరపగా భారత సైన్యం దీటుగా తిప్పికొట్టింది.

## పరీక్షలు జరపాలని విద్యార్థులు ప్రభుత్వాన్ని వేడుకునే దుస్థితి వచ్చింది: హరీశ్ రావు

సకాలంలో జరగకపోవడం వల్ల చివరి సంవత్సరం చదువుతున్న డిగ్రీ విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. పీజీసెట్, లాసెట్ వంటి ప్రవేశ పరీక్షలతో పాటు ఇతర పోటీ పరీక్షలు రాసేందుకు వారు అర్హత కోల్పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఇంత కీలకమైన విషయంలో ముఖ్యమంత్రి, మంత్రులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, పరీక్షలను సకాలంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.మరోవైపు, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డిగ్రీ కళాశాలలకు ప్రభుత్వం సుమారు రూ.800 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాల్సి ఉందని హరీశ్‌రావు ఆరోపించారు. నిధులు విడుదల చేయకపోవడంతో కళాశాలలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. సరైన సమయంలో డిగ్రీ పరీక్షలు నిర్వహించాలని విద్యార్థులు ప్రభుత్వాన్ని అభ్యర్థించాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడిందని, ఇది ప్రభుత్వ పాలనా వైఫల్యానికి స్పష్టమైన నిదర్శనమని ఆయన మండిపడ్డారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల మొత్తాన్ని వెంటనే విడుదల చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# ఉమ్మడి నల్గొండను సస్యశ్యామలం చేయడమే లక్ష్యం



## మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి



**మిర్యాలగూడ, క్రైమ్ మిర్రర్ మే 4:** ఉమ్మడి నల్గొండ జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు అన్ని నియోజకవర్గాల్లో నీటిపారుదల పనులను వేగవంతం చేస్తున్నామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తంకుమార్ రెడ్డి తెలిపారు. మిర్యాలగూడలోని ఎస్పీ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రితో పాటు, రోడ్లు, భవనాలు శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, నల్గొండ, యాదాద్రి-భువనగిరి, సూర్యాపేట జిల్లాల ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు.

**ప్రాజెక్టులకు పెద్ద ఎత్తున బడ్జెట్:**

ఈ ఏడాది బడ్జెట్‌లో రూ. 23,000 కోట్లు నీటిపారుదల కోసం కేటాయించామని మంత్రి తెలిపారు. ఇప్పటికే 1100 మంది ఇంజినీర్లను నియమించి శాఖను బలోపేతం చేశామన్నారు. నాగార్జునసాగర్, ఎస్ఎల్‌బీసీ, డిండి, గంధమళ్ళ, ఉదయ సముద్రం, బ్రాహ్మణవెల్లేముల వంటి ప్రాజెక్టుల పనులను వేగవంతం చేస్తున్నామని చెప్పారు. ప్రత్యేకంగా ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులను త్వరలో పూర్తి చేయనున్నట్లు ప్రకటించారు.

**పౌరసరఫరాల్లో చారిత్రాత్మక మార్పులు:**

తెలంగాణ దేశంలో అత్యధిక ధాన్యం ఉత్పత్తి చేసిన రాష్ట్రంగా నిలిచిందని మంత్రి తెలిపారు. గత సీజన్‌లో 280 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం పండించామని వెల్లడించారు. సన్న రకానికి రూ. 500 బోనస్ అందిస్తామని తెలిపారు. 84 శాతం జనాభాకు ఉచితంగా ప్రతి ఒక్కరికీ 6 కిలోల సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు.

**ప్రతి నియోజకవర్గానికి ప్రత్యేక దృష్టి:**

మునుగోడు, దేవరకొండ, మిర్యాలగూడ తదితర నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రాంతీయ ప్రాజెక్టులకు నిధుల కేటాయింపుపై విజ్ఞప్తులు చేశారు. మంత్రులు వాటిపై స్పందిస్తూ, భూ సేకరణ, అటవీ అనుమతులు, లస్కర్ల నియామకాలకు సంబంధించిన చర్యలు చేపట్టనున్నట్లు హామీ ఇచ్చారు.

**రోడ్లు, భవనాలకు భారీ నిధులు:**

రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి రూ. 150 కోట్లు రోడ్ల అభివృద్ధికి ఖర్చు చేయనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. నల్గొండ జిల్లాకు ఇప్పటికే రూ. 1700 కోట్లు కేటాయించామన్నారు.

**సమగ్ర సమీక్ష, చురుకైన నిర్ణయాలు:**

సమీక్షలో అధికారులు పెండింగ్ ప్రాజెక్టుల పురోగతి, భూ సేకరణ సమస్యలు, బియ్యం కొనుగోలు సమస్యలు తదితర అంశాలపై వివరణలు ఇచ్చారు. రైతులకు సమస్యలు కలగకుండా అన్ని శాఖల సమన్వయంతో తగిన చర్యలు తీసుకుంటామని మంత్రులు హామీ ఇచ్చారు.




## ఘనంగా నామ క్రిష్ణయ్య గారి జన్మ దిన వేడుకలు

**ఖమ్మం (క్రైమ్ మిర్రర్ ప్రతినిధి):** మధుకాన్ షుగర్ అండ్ పవర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ నామ క్రిష్ణయ్య జన్మదిన%శీ% సందర్భంగా స్థానిక మధుకాన్ ఎంప్లాయిస్ కేక్ కట్ చేసి తలసేమియ బాధితులకు రక్తదానం మరియు ఖమ్మంఅన్న క్యాంటీన్ లో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ ఏవీపీ కోటయ్య,డీజీఎం కేన్ అప్పారావు, ఏజీఎం హెచ్ ఆర్ నరేష్ మరియు సంస్థ అధికారులు మరియు కార్మికులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం- 2011-2012

### జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పర్వేద






**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** 13సంవత్సరాల తర్వాత జీవితంలో స్థిరపడి ఒకే వేదికపై అందరూ చిన్ననాటి తరగతిగది చిలిపి చేష్టలను నెమరు వేసుకున్నారు. రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి మండలం గ్రామము పర్వేద లో ఉన్నత పాఠశాలలో 2011-2012 సంవత్సరంలో పదవ తరగతి చదివి తదనంతరం వారి వారి వృత్తి,ఉద్యోగాలలో స్థిరపడిపోయారు. అయితే వారంతా ప్రస్తుతం ఒకే వేదికపై జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఏర్పాటు చేసుకున్న ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకొని తమ చిన్ననాటి అనుభవాలను వేదికపై పంచుకున్నారు. పాఠశాలలోని తరగతి గదిలో జరిగిన సంఘటనలను పూర్వ ఉపాధ్యాయులు,పూర్వ విద్యార్థుల సమక్షంలో వారి వారి అభిప్రాయాలను పంచుకొని ఆనందంగా గడిపారు. 13సంవత్సరాల అనంతరం ఇలా అందరూ ఒకే వేదికపై కలుసుకోవడం సంతోషంగా ఉందని వారి వారి అభిప్రాయాలలో వెలి బుచ్చారు. అప్పట్లో ఉపాధ్యాయులుగా పనిచేసిన కొందరు మాట్లాడుతూ13 సంవత్సరాల తర్వాత ఒకే వేదికపై కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## అండర్ డ్రైనేజ్ పనులు తొందరగా పూర్తి చేయండి



**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని కూరగాయల మార్కెట్లో ఆదివారం డ్రైనేజ్ పైప్ లైన్ లీక్ అయ్యి, అందులోని మురుగు నీరు బయటకు ఉబికి వచ్చి మార్కెట్ రోడ్డు మీద పారాయి. ఆ డ్రైనేజీ పైపులైన్లకు, సులబ్ కాంప్లెక్స్ నీరు రెండు కలవడం వలన రోడ్లపై దుర్వాసన భరితమైన నీళ్లు పారడంతో స్థానిక వ్యాపారస్తులు, పాదాచారులు, కూరగాయల వ్యాపారస్తులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గత పది రోజుల్లో మూడు సార్లు ఈ నీరు బయటకు వచ్చింది. కూరగాయల మార్కెట్ లోని మురుగంత ఈ పైపులైన్లో కలవడం వలన మాటిమాటికి పైపులైన్లు జామై నీరు బయటికి వస్తుంది. ఆ పైపులైన్ లో నీరు మామూలు నీరు అయితే పర్వాలేదు గాని, సులబ్ కాంప్లెక్స్ లో నీరు కరవడం వలన దుర్గంధ వాసన బయటకు రావడం జరుగుతుంది. వాసన భరించలేక వ్యాపారస్తులు వ్యాపారాలు చేయలేకపోతున్నారు. వెంటనే మునిసిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



## కొండకల్ గ్రామంలో బీరప్ప గుడి ద నీ సందర్శించిన బండమీది వెంకటేష్

### కురుమ సంగము అధ్యక్షులు

**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** కొండకల్ గ్రామంలో బీరప్పల గుడి ఆదివారం రోజున స్లాప్ వేయడం జరుగుతున్నది కావున గుడి ప్రాంగణంలో చేరుకొని గుడిని సందర్శించిన కురుమ సంఘం అధ్యక్షులు వెంకటేష్ ఈ కార్యక్రమంలో గ్రామ సంగం సభ్యులు పాల్గొన్నారు .



## కాళేశ్వరంపై కాంగ్రెస్ కుట్రలు - వాస్తవాలపై చర్చా కార్యక్రమం

### మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



**క్రైమ్ మిర్రర్, మహాదేవ్ పూర్ ప్రతినిధి:** తెలంగాణకు జలభాండాగారమైన కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ పన్నిన కుట్రలను పటాపంచలు చేసి ప్రజలకు అసలు వాస్తవాలను వివరించడానికి కాళేశ్వరం గోదావరినది ఒడ్డున సోమవారం రోజు ఉదయం 11 గంటలకు చర్చా కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలి బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ మధుసూధనాచారి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, నడిపెల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, దాసరి మనోహర్‌రెడ్డి, కోరుకంటి చందర్, గండ్ర వెంకటరమణారెడ్డి, మాజీ జడ్పీచైర్పర్సన్లు జక్కు శ్రీహర్షిణి, దావ వసంతలతో పాటు సాగనీటి నిపుణుడు వీరమల్ల ప్రకాష్ తదితరులు పాల్గొని కాళేశ్వరం ప్రాజెక్టుపై జరుగుతున్న కుట్రల గురించి కూలంకషంగా చర్చించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మంథని నియోజకవర్గానికి చెందిన ప్రజలు, మేధావులు, తెలంగాణ వాదులు హాజరై కాళేశ్వరంపై కాంగ్రెస్ చేస్తున్న కుట్రలను పటాపంచలు చేసి ప్రజల్లోకి వాస్తవ విషయాలను తీసుకెళ్లాలని కోరారు.

## 16న అమెరికాకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్: ఈ నెల 16న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అమెరికాకు వెళ్లనున్నారు. తమ కుమారుని గ్రాడ్యుయేషన్ కార్యక్రమానికి కవిత దంపతులు హాజరుకానున్నారు. విదేశీ పర్యటనకు సీబీఐ కోర్టు అనుమతి ఇవ్వడంతో? ఆమె ఈ నెల 16 నుంచి 23 వరకు అమెరికాలో పర్యటించనున్నారు. తమ కుమారుడు ఆదిత్య గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో పాల్గొనున్నారు. ఈ నెల 16వ తేదీన అమెరికాకు బయలుదేరి.. ఆ కార్యక్రమం ముగిసిన తర్వాత ఈ నెల 23వ తేదీన తిరిగి హైదరాబాద్ చేరుకుంటారు. ఈ విదేశీ పర్యటనకు అనుమతినిస్తూ.. ఢిల్లీలోని రౌజ్ ఎవెన్యూ సీబిఐ ప్రత్యేక కోర్టు అనుమతిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.



# పకడ్బందీగా పాస్‌వర్డ్

## ఆర్థిక మోసాలకు చెక్ పెట్టండిలా

**పాస్‌వర్డ్‌లు అనేవి ఎంతో కీలకం. ముఖ్యంగా ఆర్థికపరమైన లావాదేవీల్లో వీటి ప్రాధాన్యత చాలా ఎక్కువ. అలాంటి ఈ పాస్‌వర్డ్‌ల విషయంలో ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా భారీ నష్టాలు తప్పవు. అందుకే పాస్‌వర్డ్‌ల నిర్మాణం, దాని భద్రత అంశంలో ఈ జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సలహా ఇస్తున్నారు. అవేంటో చూస్తే..**

మొబైల్/ఇంటర్నెట్ బ్యాంకింగ్ పాస్‌వర్డ్‌లను ఎవరితోనూ పంచుకోవద్దు. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులకు చెప్పాల్సి వస్తే.. సదరు లావాదేవీ పూర్తయిన వెంటనే కొత్త పాస్‌వర్డ్‌ను మార్చుకోవాలి.

- అత్యంత క్లిష్టతరంగా, ఎవరి ఊహలకు అందనివిధంగా ఈ పాస్‌వర్డ్‌ల నిర్మాణం ఉంటే మంచిది. డిక్షనరీ వర్డ్స్‌ను వాడటం వల్ల పాస్‌వర్డ్‌లను సైబర్ మోసగాళ్లు ఊహించే వీలున్నది.
- మాతృ భాషకు చెందిన అక్షరాలు లేదా మీకు మాత్రమే తెలిసిన తేదీలు, రకరకాల చిహ్నాలను పెట్టుకోవాలి. అప్పుడే డీ కోడింగ్‌కు కష్టమవుతుంది.
- ప్రతీ 3 లేదా 6 నెలలకోసారి పాస్‌వర్డ్‌లను మారిస్తే ఉత్తమం. సుదీర్ఘకాలంపాటు ఒకే పాస్‌వర్డ్‌ను వాడటం వల్ల సైబర్ మోసగాళ్లబారినపడే ప్రమాదం పొంచి ఉంటుంది.
- కనీసం 16 అక్షరాలతో పాస్‌వర్డ్ ఉండాలి. పాస్‌వర్డ్ ఎంత పెద్దదైతే దాన్ని కనిపెట్టడం మోసగాళ్లకు అంత కఠినమవుతుందనే విషయం గుర్తుంచుకోండి.
- ఉచిత వైఫైలను వాడరాదు. ఎయిర్‌పోర్ట్, రైల్వే స్టేషన్, హోటళ్లలో ఫ్రీగా వస్తుందని ఉపయోగిస్తే మీ ఇంటర్నెట్ బ్రౌజింగ్ ఇతరులకు తెలిసే వీలున్నది. ఈ సమయంలో ఆర్థిక లావాదేవీలను అస్సలు జరుపవద్దు. పిన్ నెంబర్లను హ్యాకర్స్ సులభంగా పసిగట్టగలరు.
- పాస్‌వర్డ్‌లను మొబైల్ ఫోన్లలో సేవ్ చేసుకోవద్దు. ఫోన్ హ్యాక్ అయినప్పుడు అందులోని విలువైన డాటా కూడా దొంగతనానికి గురవుతుంది.

# ఆర్థిక క్రమశిక్షణ లేకపోతే అంతే సంగతి..

**ప్రతీ ఒక్కరికీ ఆర్థిక క్రమశిక్షణ చాలా అవసరం. అయితే అది లేక కొందరు, అది ఉన్నప్పటికీ అవగాహన లేక తప్పుడు నిర్ణయాలు తీసుకొని మరికొందరు పెద్ద ఎత్తున మూల్యం చెల్లించుకుంటున్నారు. మరి నిపుణులేమంటున్నారో చూద్దాం.**



### అవగాహనతో..

ప్రతీదానిపై అవగాహన ఉంటేనే లాభమైనా.. విజయమైనా దక్కుతుంది. ముఖ్యంగా ఎలాంటి అవగాహన లేకుండా, విచారణ చేయకుండా తొందరపడి నేరుగా స్టాక్స్‌లో పెట్టుబడులు పెట్టడం నష్టాలకు దారితీయవచ్చు. స్టాక్ మార్కెట్లపై విశ్లేషణ చేసి, పూర్తిగా రిసెర్చ్ చేశాకే ఓ నిర్ణయానికి రావడం ఉత్తమం. ఈక్విటీ మార్కెట్లపై అవగాహనను పెంచుకోవడానికి అసలు సమయమే లేని చిన్న మదుపరులు ఈ పెట్టుబడులకు దూరంగా ఉండటమే లాభదాయకం. అయితే మ్యూచువల్ ఫండ్స్ ద్వారా స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులకు దిగడం ఒకింత తెలివైన పనేనని నిపుణులు చెప్తున్నారు. అయినప్పటికీ మీకొచ్చే ఆదాయం మార్కెట్ ఒడుదొడుకులకు లోబడే ఉంటుందన్నది మరువద్దు. మొత్తానికి ఎక్స్‌పర్ట్స్ సలహాలతో ముందుకెళ్తేనే ప్రయోజనం.

### అతితో అనర్థాలే..

కొందరు ఏం చేసినా అపరిమిత స్థాయిలోనే ఉంటుంది. ఈ క్రమంలోనే విపరీతంగా స్టాక్స్‌ను కొంటూంటారు. అలాగే ఫండ్స్‌నూ అదేస్థాయిలో రకరకాల పెట్టుబడి సాధనాల్లోకి మళ్లిస్తూ ఉంటారు. అయితే వైవిధ్యం అనేది వ్యూహమే అయినా.. ఒక మోతాదు దాటితే దుష్పరిణామాలకే దారితీస్తుంది. ఓ సర్వే ప్రకారం మీ పోర్ట్‌ఫోలియోలో వివిధ రంగాల నుంచి 15-20 శాతం స్టాక్స్.. మీకున్న రిస్క్‌ను తగ్గిస్తుంది. ఇంతకు మించితే ఎటువంటి లాభమూ దక్కదు. కాబట్టి స్టాక్స్ కొనుగోలు, నిధుల మళ్లింపుల్లో అతి పనికిరాదు.

### బీమాను మరువద్దు

ప్రతీది పన్ను కోణంలో చూడవద్దు. పెట్టుబడులైనా, బీమా అయినా పన్ను మినహాయింపులను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకోవద్దు. ముఖ్యంగా బీమా పాలసీల విషయంలో ఈ రకమైన ఆలోచన శ్రేయస్కరం కాదు. ఎందుకంటే పన్ను మినహాయింపుల కోసం బీమా పాలసీలను తీసుకుంటే.. కావాల్సిన ప్రయోజనాలను మీరు కోల్పోవాల్సి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మనకు అవసరమైన బీమాలో భాగంగానే పన్ను ప్రయోజనాలు దక్కాలిగానీ.. మొత్తం పాలసీనే నిరుపయోగంగా మార్చవద్దని హితవు పలుకుతున్నారు. అలాగే సమగ్రరీతిలో కవరేజీ ఉన్న పాలసీలనే తీసుకోవాలని సూచిస్తున్నారు. ఒకటికి మించి బీమా పాలసీలుంటే మంచిదే అయినప్పటికీ.. మీమీ ఆర్థిక అనుకూలతలనూ పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకోవడం ఉత్తమం.

### రుణ భారం

అవసరమున్నా, లేకున్నా నేడు చాలామంది మితిమీరిన రుణ భారాన్ని తలకెత్తుకుంటున్నారు. బ్యాంకింగ్, నాన్-బ్యాంకింగ్ సంస్థల నుంచి వస్తున్న ఆఫర్లతో కొందరు.. క్రెడిట్ కార్డు సంస్థల నుంచి వస్తున్న ప్రకటనలతో మరికొందరు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. దీనివల్ల జీవితంలో రాజీపడి బ్రతకాల్సిన దుస్థితి ఏర్పడుతున్నది. కాబట్టి అప్పుచేసి పప్పుకూడు ఎప్పటికీ మంచిది కాదని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఆదాయ-వ్యయాల మధ్య అంతరాలను తెలుసుకొని జీవించాలంటున్నారు. అనవసరపు కోర్కెలను తీర్చుకోవడానికి చేసే అప్పులు.. మున్ముందు గృహ రుణం వంటి కీలక లక్ష్యాల సాధనను అంటకపర్చే వీలుకూడా లేకపోలేదు. కాబట్టి అప్పుల విషయంలో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

### చివరగా..

ప్రతి ఒక్కరూ తమ ఆర్థిక స్థోమతను తెలుసుకొని ప్రవర్తించాలి. ప్రధానంగా ఇటీవలి కాలంలో అన్ని రంగాల్లో స్థిరత్వం లోపించింది. ఉద్యోగాలను కోల్పోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అందుకే కనీసం 6 నెలల అవసరాలు తీరేలా అత్యవసర నిధి ఉండాలి. సురక్షితమైన పెట్టుబడులకు పెద్దపీట వేస్తూనే.. పొదుపునకూ ప్రాధాన్యత ఇవ్వాలి. వీలుంటే రుణ భారాన్ని తగ్గించుకోవాలి. అవసరం మేరకే ఖర్చులుండాలి. విస్తృత శ్రేణి ఆరోగ్య, జీవిత బీమా పాలసీలను తీసుకోండి. అడ్డగోలు రాబడులనిచ్చే మోసపూరిత స్కీములకు దూరంగా ఉండండి. తొందరపాటుతో కాకుండా ఓ ప్రణాళికతో ముందుకెళ్తే విజయాలు సొంతమవుతాయి.

### పొదుపుతోనే రక్ష

పొదుపును ఎప్పుడూ అశ్రద్ధ చేయవద్దు. ప్రతీ వ్యక్తికి ఉండాల్సిన ఆర్థిక క్రమశిక్షణలో తెలివైన పెట్టుబడులకు ఎంత ప్రాధాన్యత ఉంటుందో.. పొందికైన పొదుపునకూ అంతే స్థానం ఉంటుంది. యుక్త వయస్సు నుంచే సేవింగ్స్‌ను అలవాటు చేసుకుంటే ఆకర్షణీయ లాభాలను పొందవచ్చు. ముఖ్యంగా అనుకోని ఖర్చులను తేలిగ్గా అధిగమించవచ్చు. ఇక నేటి యువతలో చాలామందికి కెరియర్ ప్రారంభంలోనే మంచి ఉద్యోగాలు, పెద్ద జీతాలు దక్కుతున్నాయి. అయితే క్రెడిట్ కార్డులు, ఖరీదైన మొబైల్ ఫోన్లు.. ఇలా లైఫ్‌ను ఎంజాయ్ చేయడంపైనే దృష్టి పెడుతున్నారు. కానీ అత్యవసర పరిస్థితుల కోసం సేవింగ్స్‌పై మాత్రం మొగ్గు చూపడం లేదు. కనుక పొదుపుపై నిర్లక్ష్య ధోరణి వీడాలి.

# ఐదు బ్యాంకులపై ఆర్‌బీఐ కొరడా.. భారీ జరిమానా




నిబంధనలు పాటించడంలో విఫమైతే 'రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' ఏ బ్యాంకుపై అయిన కఠిన చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగానే ఐసీఐసీఐ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, యాక్సిస్ బ్యాంక్‌లతో సహా మొత్తం ఐదు బ్యాంకులకు ఆర్‌బీఐ జరిమానాలు విధించింది. బ్యాంకులలో సైబర్ సెక్యూరిటీ ఫ్రేమ్‌వర్క్,కేవైసీ, క్రెడిట్ అండ్ డెబిట్ కార్డ్ మొదలైనవాటికి సంబంధించిన ఆదేశాలను పాటించనందుకు ఐసీఐసీఐ బ్యాంకుకు.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ. 97.80 లక్షల జరిమానా విధించింది. కస్టమర్ సేవలు, బ్యాంకులు అందించే ఆర్థిక సేవలకు సంబంధించిన కొన్ని మార్గదర్శకాలను పాటించడంలో బ్యాంక్ ఆఫ్ బరోడా విఫలమైందని.. ఆర్‌బీఐ రూ. 61.40 లక్షల జరిమానా విధించింది. అంతర్గత ఖాతాల అనధికార నిర్వహణకు సంబంధించిన కొన్ని ఆదేశాలను పాటించనందుకు యాక్సిస్ బ్యాంకుకు కూడా రూ. 29.60 లక్షల జరిమానా పడింది. కిసాన్ క్రెడిట్ కార్డ్ ద్వారా పొందిన వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాల కోసం స్వల్పకాలిక రుణాలకు వడ్డీ రాయితీ పథకంపై కొన్ని ఆదేశాలను పాటించనందుకు ఐడీబీఐ బ్యాంక్ లిమిటెడ్‌పై కేంద్ర బ్యాంకు రూ. 31.8 లక్షలు, కేవైసీకి సంబంధించిన కొన్ని ఆదేశాలను పాటించనందుకు బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రకు రూ. 31.80 లక్షల జరిమానా విధించింది.

# సెకీతో రిలయన్స్ న్యూ సన్‌టెక్ ఒప్పందం




ముంబై: రిలయన్స్ పవర్ అనుబంధ సంస్థ రిలయన్స్ న్యూ సన్‌టెక్ తాజాగా సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ (సెకీ)తో పాతికేళ్ల దీర్ఘకాలిక విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పీపీఏ) కుదుర్చుకుంది.ఒప్పందం ప్రకారం వచ్చే 24 నెలల్లో సమీకృత సోలార్ అలాగే బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టం (బీఈఎస్ఎస్) ప్రాజెక్టును నిర్మించాల్సి ఉంటుంది. ఈ ప్రాజెక్టుపై రూ. 10,000 కోట్ల వరకు ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. కేడబ్ల్యూహెచ్‌కి రూ. 3.53 ఫిక్సిడ్ రేటు చొప్పున విద్యుత్ సరఫరా చేయాల్సి ఉంటుంది.

## వర్చువల్ గలాక్సీ ఐపీవో బాట

న్యూఢిల్లీ: బీఎఫ్ఎస్ఐపై ప్రత్యేక దృష్టిపెట్టిన సాస్(ఎస్ఏఏఎస్) సేవల సంస్థ వర్చువల్ గలాక్సీ ఇన్ఫోటెక్ పబ్లిక్ ఇష్యూ సన్నాహాలు ప్రారంభించింది. ఇందుకు వీలుగా స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్ఎస్ఈ ఎమర్జ్‌కు ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా 66 లక్షల ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. నిధుల్లో రూ. 34 కోట్లు అదనపు అభివృద్ధి కేంద్రాల ఏర్పాటుకు, రూ. 19 కోట్లు ప్రస్తుత ప్రొడక్టుల ఆధునీకరణ, విస్తరణ తదితరాలకు వినియోగించనుంది. మరో రూ. 14 కోట్లు బిజినెస్ డెవలప్‌మెంట్, మార్కెటింగ్ కార్యకలాపాలపై వెచ్చించనుంది.కాగా.. జులైలో ప్రీఐపీవో నిధుల సమీకరణలో భాగంగా సుప్రసిద్ధ ఇన్వెస్టర్ల నుంచి రూ. 21.44 కోట్లు సమకూర్చుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) తొలి ఆరు నెలల్లో(ఏప్రిల్%-%సెప్టెంబర్) రూ. 72 కోట్ల ఆదాయం, రూ. 19 కోట్ల నికర లాభం ఆర్జించింది.


క్రైమ్ మిర్రర్

విలేకరులు కావలెను

క్రైమ్ మిర్రర్ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు, నియోజకవర్గం, మండలాలవారీగా అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను.

ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.

93934 46188


# డ్రోన్ కొనుగోలుకు రూ.8 లక్షలు సాయం

మహిళా స్వయం సహాయక సంఘాలకు ఉపాధి కల్పించేలా కేంద్రం ప్రవేశపెట్టిన 'నమో డ్రోన్ దీదీ' పథకానికి సంబంధించి ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ పథకంలో నమోదు చేసుకున్న ఒక్కో సంఘానికి రూ.8 లక్షలు మేర సాయం చేయనున్నట్లు కేంద్రం ప్రకటించింది. 2024-26 ఆర్థిక సంవత్సరం వరకు ఈ పథకంలో భాగంగా సుమారు 14,500 మహిళా స్వయం సహాయక సంఘాలకు డ్రోన్లు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొంది. వ్యవసాయం ఎంతో శ్రమతో కూడుకున్నది. టెక్నాలజీ సహాయంతో వ్యవసాయాన్ని సులువుగా చేసేందుకు వీలుగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులో స్థానిక మహిళా స్వయం సహాయక సంఘాలను భాగం చేస్తోంది. వారికి డ్రోన్లు అందించి సరైన శిక్షణ ఇవ్వడంతో ఉపాధి కల్పిస్తోంది. అదే సమయంలో రైతులపై పనిభారం తగ్గినట్లవుతుందని కేంద్రం భావిస్తోంది. అందుకోసం 'నమో డ్రోన్ దీదీ' పథకాన్ని గతంలోనే ప్రారంభించింది.



## 'కవితకు తెలియకుండానే మనసులో మాట బయటకు వచ్చింది'

హైదరాబాద్: తెలంగాణ ప్రజలను మోసం చేయడానికి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత సామాజిక తెలంగాణ అంటూ కొత్త రాగం తీసుకుందని ధ్వజమెత్తారు సీనియర్ కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి. ఈ మేరకు ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. అధికారం పోయిన తర్వాత చాలా పెద్ద పెద్ద మాటలు కవిత మాట్లాడుతుంది. ఇవన్నీ అధికారంలో ఉన్నప్పుడు గుర్తుకులేవా?, మీ తండ్రి సీఎంగా ఉన్నప్పుడు సామాజిక తెలంగాణ గుర్తుకు రాలేదా?, అధికారం పోగానే సామాజిక తెలంగాణ గుర్తుకు వచ్చిందా?' అంటూ మండిపడ్డారు జగ్గారెడ్డి. రాహుల్ గాంధీ నాయకత్వంలో, సీఎం రేవంత్ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో సామాజిక ప్రజా పరిపాలన కొనసాగుతుందని, తెలంగాణలో గొంతు విప్పి మాట్లాడే స్వేచ్ఛను తెలంగాణ ప్రభుత్వమే ఇచ్చిందన్నారు. ఆ స్వేచ్ఛలోనే కవిత గొంతు కూడా మాట్లాడుతుందన్నారు. కొత్త కొత్త రాగాలు ఎంచుకుని, నటించడం కవిత కుటుంబానికే సాధ్యమని, కేసీఆర్ ది నటనతో కూడిన పాలన అని, కాంగ్రెస్ ప్రభుత్వంది ప్రజా పాలన అని స్పష్టం చేశారు. 'ఎవరికైనా నష్టం జరిగిదే... స్వేచ్ఛ గా ఇందిరాపార్కు దగ్గర నిరసన చేసే స్వేచ్ఛ కాంగ్రెస్ ఇచ్చింది. తెలంగాణ లో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే తెలంగాణ ప్రజలు స్వేచ్ఛ కోరుకున్నారు. అందుకే మా ప్రభుత్వం స్వేచ్ఛ ను ఇచ్చింది. ఇందిరాపార్కు మాత్రమే కాదు... ఏ జిల్లా కలెక్టర్ ఆఫీస్ కు వెళ్లినా నిరసన చేసే స్వేచ్ఛ ఇచ్చింది. సామాజిక తెలంగాణ కోరుకుంటే.. కులగణన చేసి సామాజిక తెలంగాణ సాదిస్తున్నాం. కొత్త సెలబస్ తో తెలంగాణ ప్రజలను మోసం చేసేలా మీ ప్రకటన ఉంది. బిఆర్ఎస్‌ను నమ్మే పరిస్థితిలో తెలంగాణ ప్రజలు లేరు. సీఎం రేవంత్ రెడ్డి పాలన ఇంకో పదేళ్లు ఉంటుంది. బిఆర్ఎస్ అధికారంలోకి తెచ్చుకుని బందీలుగా ఉండాలని ఎవరూ అనుకోరు. కేసీఆర్ పదేళ్ల లో సామాజిక తెలంగాణ కోసం పనిచేయలేదని కవిత చెప్పకనే చెప్పింది. కవితకు తెలియకుండానే మనసులో మాట బయటకు వచ్చింది' అని ఎద్దేవా చేశారు జగ్గారెడ్డి.



## నేటి నుంచి 28 మండలాల్లో భూభారతి రెవెన్యూ సదస్సులు

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా భూభారతి చట్టం దశలవారీ అమలులో భాగంగా..ఈ నెల 5వ తేదీ నుంచి 20వరకు రాష్ట్రంలోని జిల్లాకో మండలాన్ని ఎంపిక చేసి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 28 జిల్లాల్లోని 28 మండలాల్లో ఈ రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తెలిపారు. 'సీఎం రేవంత్‌రెడ్డి సలహాలు, సూచనలతో రైతు కళ్లలో ఆనందం తీసుకురావడం కోసమే భూభారతి చట్టాన్ని చేశాం. ఈ చట్టంతో భూపరిపాలనలో కొత్త అధ్యాయానికి నాంది పలికాం. ఏప్రిల్ నెల 17 నుంచి 30 వరకు నాలుగు మండలాల్లో ఈ సదస్సులు నిర్వహించాం. ఈ నెలలో 28 మండలాల్లో సదస్సులు నిర్వహిస్తున్నాం. భూభారతి చట్టంపై ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించడంతో పాటు భూసమస్య దరఖాస్తులను స్వీకరించి వాటిని పరిష్కరించడమే ఈ సదస్సుల లక్ష్యం. ప్రతి సదస్సుకు ఆయా జిల్లాల కలెక్టర్లు హాజరై సమర్థంగా నిర్వహించాలి. అందరి సహకారంతో ఈ చట్టాన్ని విజయవంతంగా అమలు చేస్తాం' అని మంత్రి పేర్కొన్నారు. భోరజ (ఆదిలాబాద్), సుజాతనగర్(భద్రాద్రి కొత్తగూడెం), నడికుడ(హనుమకొండ), బుగ్గారం(జగిత్యాల), ఘన్‌పూర్(జనగామ), రేగొండ(జయశంకర్ భూపాలపల్లి), ఇటిక్యాల(జోగులాంబ గద్వాల), సైదాపూర్(కరీంనగర్), పెంచికల్‌పేట్ (కుమురం భీం), దంతాలపల్లి(మహబూబాబాద్), మూసాపేట(మహబూబ్‌నగర్), భీమారం(మంచిర్యాల), చిలప్‌చెడ్(మెదక్), కీసర(మేడ్చల్ మల్కాజిగిరి), పెంట్లవల్లి(నాగర్ కర్నూల్), నకిరేకల్(నల్గొండ), కుంటాల (నిర్మల్), మెండోరా(నిజామాబాద్), ఎలిగేడ్(పెద్దపల్లి), రుద్రంగి (రాజన్న సిరిసిల్ల), కుందుర్గ్(రంగారెడ్డి), కొండాపూర్(సంగారెడ్డి), అక్కన్నపేట (సిద్దిపేట), గరిడేపల్లి(సూర్యాపేట), ధరూర్(వికారాబాద్), గోపాల్‌పేట (వనపర్తి), వర్ధన్నపేట(వరంగల్), ఆత్మకూరు(యాదాద్రి భువనగిరి జిల్లా)


## 'కవితకు తెలియకుండానే మనసులో మాట బయటకు వచ్చింది'





హైదరాబాద్: తెలంగాణ ప్రజలను మోసం చేయడానికి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత సామాజిక తెలంగాణ అంటూ కొత్త రాగం తీసుకుందని ధ్వజమెత్తారు సీనియర్ కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి. ఈ మేరకు ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. అధికారం పోయిన తర్వాత చాలా పెద్ద పెద్ద మాటలు కవిత మాట్లాడుతుంది. ఇవన్నీ అధికారంలో ఉన్నప్పుడు గుర్తుకులేవా?, మీ తండ్రి సీఎంగా ఉన్నప్పుడు సామాజిక తెలంగాణ గుర్తుకు రాలేదా?, అధికారం పోగానే సామాజిక తెలంగాణ గుర్తుకు వచ్చిందా?' అంటూ మండిపడ్డారు జగ్గారెడ్డి. రాహుల్ గాంధీ నాయకత్వంలో, సీఎం రేవంత్ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో సామాజిక ప్రజా పరిపాలన కొనసాగుతుందని, తెలంగాణలో గొంతు విప్పి మాట్లాడే స్వేచ్ఛను తెలంగాణ ప్రభుత్వమే ఇచ్చిందన్నారు. ఆ స్వేచ్ఛలోనే కవిత గొంతు కూడా మాట్లాడుతుందన్నారు. కొత్త కొత్త రాగాలు ఎంచుకుని, నటించడం కవిత కుటుంబానికే సాధ్యమని, కేసీఆర్ ది నటనతో కూడిన పాలన అని, కాంగ్రెస్ ప్రభుత్వంది ప్రజా పాలన అని స్పష్టం చేశారు. 'ఎవరికైనా నష్టం జరిగిదే... స్వేచ్ఛ గా ఇందిరాపార్కు దగ్గర నిరసన చేసే స్వేచ్ఛ కాంగ్రెస్ ఇచ్చింది. తెలంగాణ లో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే తెలంగాణ ప్రజలు స్వేచ్ఛ కోరుకున్నారు. అందుకే మా ప్రభుత్వం స్వేచ్ఛ ను ఇచ్చింది. ఇందిరాపార్కు మాత్రమే కాదు... ఏ జిల్లా కలెక్టర్ ఆఫీస్ కు వెళ్లినా నిరసన చేసే స్వేచ్ఛ ఇచ్చింది. సామాజిక తెలంగాణ కోరుకుంటే.. కులగణన చేసి సామాజిక తెలంగాణ సాదిస్తున్నాం. కొత్త సెలబస్ తో తెలంగాణ ప్రజలను మోసం చేసేలా మీ ప్రకటన ఉంది. బిఆర్ఎస్‌ను నమ్మే పరిస్థితిలో తెలంగాణ ప్రజలు లేరు. సీఎం రేవంత్ రెడ్డి పాలన ఇంకో పదేళ్లు ఉంటుంది. బిఆర్ఎస్ అధికారంలోకి తెచ్చుకుని బందీలుగా ఉండాలని ఎవరూ అనుకోరు. కేసీఆర్ పదేళ్ల లో సామాజిక తెలంగాణ కోసం పనిచేయలేదని కవిత చెప్పకనే చెప్పింది. కవితకు తెలియకుండానే మనసులో మాట బయటకు వచ్చింది' అని ఎద్దేవా చేశారు జగ్గారెడ్డి.


# ఆర్టీఐ కమిషనర్ల నియామకానికి బ్రేక్

### ప్రభుత్వం సిఫారసులను పెండింగ్‌లో పెట్టిన గవర్నర్

### అనర్హులను సిఫారసు చేశారని ఫిర్యాదులు అందడంతో చర్యలు

### ప్రభుత్వం నుంచి వివరణ కోరనున్న రాజ్‌భవన్

### కొందరి పేర్లు మినహా మిగిలిన వారిని ఆమోదించే అవకాశం




హైదరాబాద్: తెలంగాణ సమాచార కమిషన్‌లో రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్, ఇతర సమాచార కమిషనర్ల భర్తీ ప్రక్రియకు బ్రేక్ పడింది. రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్‌గా ఐఎఫ్ఎస్ అధికారి జి.చంద్రశేఖర్‌రెడ్డితో పాటు మరో ఏడుగురు సమాచార కమిషనర్ల నియామక ప్రతిపాదనలను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం కోసం గత నెలలో రాష్ట్ర ప్రభుత్వం రాజ్‌భవన్‌కు పంపించింది. కొందరు అభ్యర్థుల అర్హతల విషయంలో ఫిర్యాదులు అందడంతో సంబంధిత ఫైల్‌ను గవర్నర్ పెండింగ్‌లో ఉంచినట్టు అధికార వర్గాలు ధ్రువీకరించాయి. ఈ విషయంలో రాజ్‌భవన్ ప్రభుత్వం నుంచి వివరణ కోరనున్నట్టు తెలిసింది.

**కొన్ని పేర్లపై అభ్యంతరం**

ప్రధాన సమాచార కమిషనర్, సమాచార కమిషనర్ల పోస్టుల భర్తీ కోసం 2023 జూలై 4న ఒకసారి, 2024 జూన్ 12న మరోసారి రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. సీఎం ఎ.రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కూడిన కమిటీ ఇటీవల సమావేశమై పలువురిని ఎంపిక చేసి రాజ్‌భవన్‌కు సిఫారసు చేసింది. ప్రధాన సమాచార కమిషనర్‌గా చంద్రశేఖర్‌రెడ్డి, సమాచార కమిషనర్లుగా జర్నలిస్టులు పీవీ శ్రీనివాస్‌రావు, బోరెడ్డి అయోధ్యరెడ్డి, కప్పర హరిప్రసాద్, న్యాయవాది పీఎల్ఎన్ ప్రసాద్‌తో పాటు రాములు, వైష్ణవి, మొహిసిన పర్వీన్ పేర్లను ప్రతిపాదించింది. సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 12(5) ప్రకారం న్యాయశాస్త్రం, సైన్స్, టెక్నాలజీ, సామాజిక సేవ, మెనేజ్‌మెంట్, జర్నలిజం, పరిపాలన రంగాల్లో విశేష కృషిచేసినవారు ఈ పోస్టులకు అర్హులు. సెక్షన్ 12(6) ప్రకారం వారు ఎమ్మెల్యే, ఎంపీ కారాదు. ఎలాంటి లాభదాయక పోస్టులో ఉండరాదు. రాజకీయ పార్టీతో ఎలాంటి అనుబంధం కలిగి ఉండరాదు. వ్యాపారాలు, ఇతర వృత్తుల్లో ఉండరాదు. కానీ, రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేసిన పేర్లలో కొందరికి రాజకీయ నేపథ్యం ఉండడంతో పలువురు వ్యక్తులు రాజ్‌భవన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ ఫైల్‌కు ఆమోదం తెలపకుండా గవర్నర్ పెండింగ్‌లో పెట్టారు. అర్హతల విషయంలో స్పష్టత వచ్చిన తర్వాతే గవర్నర్ ఆమోదించే అవకాశం ఉంది. అవసరమైతే గవర్నర్ కొందరు అభ్యర్థుల పేర్లను మినహాయించి ఇతరుల పేర్లను ఆమోదించే అవకాశం ఉంది. వారం రోజుల్లో ఈ అంశంపై స్పష్టత రానుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

# పిల్లలు పుట్టలేదు అని భార్యని చంపి తన ఇంట్లోనే..

### పిల్లలు పుట్టడం లేదని భార్యను చంపిన భర్త

### ఉరేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు యత్నం

### కేసును ఛేదించిన పోలీసులు.. ఐదుగురిపై కేసు





జగిత్యాలక్రైం: నిండునూరేళ్లు కలిసి ఉంటామని.. ఏడడుగులు నడిచి ప్రమాణం చేసిన భర్తే కాలయముడై భార్యను హత్య చేసిన ఘటన జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలకేంద్రంలో జరిగింది. హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు యత్నించగా ఎట్టకేలకు పోలీసులు కేసును ఛేదించారు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ వివరాలు వెల్లడించారు.

**ఇరవై ఏళ్ల క్రితం వివాహం**

కరీంనగర్ జిల్లా గంగాధర మండలం మల్లాపూర్‌కు చెందిన మమతను (35) ఇరవై ఏళ్ల క్రితం జగి త్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన అవుదుర్తి మహేందర్‌కు ఇచ్చి వివాహం చేశా రు. వివాహ సమయంలో కట్నకానుకలు ముట్టజెప్పారు. కానీ, ఆర్థిక సమస్యలు తలెత్తడంతో కొద్ది రోజులుగా భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. మహేందర్ మద్యానికి బానిసై అప్పులు చేశాడు. రోజూ తాగి వచ్చి మమతను వివాహ సమయంలో కట్నం తక్కువగా ఇచ్చారని, పిల్లలు పుట్టడం లేదని తీవ్రంగా వేధించాడు. అతడితోపాటు తల్లి వజ్రవ్వ, తండ్రి లక్ష్మణ్, తమ్ముళ్లు అ నిల్, వెంకటేశ్ కూడా వేధింపులకు గురిచేసేవారు. మహేందర్ ఏ పని చేయకపోవడంతో మమత కరీంనగర్‌లోని ఓషాపింగ్‌మాల్‌లో ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది.

**ఇరవై రోజుల క్రితం పంచాయితీ**

తరుచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరగడంతో 20 రోజుల క్రితం మల్లాపూర్‌లో పంచాయితీ నిర్వహించారు. దీంతో మమతను బాగా చూసుకుంటానని మహేందర్ కరీంనగర్‌లోని అద్దె ఇంటికి తీసుకెళ్లాడు. అనంతరం పుస్తెలతాడు ఇవ్వాలని మమతను కోరగా నిరాకరించింది. ఈనేపథ్యంలో మహేందర్ గతనెల 26న నల్లగొండ, వేములవాడ దైవ దర్శనానికని నమ్మించి, దైవ దర్శనం అనంతరం కొడిమ్యాలకు తీసుకెళ్లాడు. అదేరోజు నైలాన్ తాడును ఆమె మెడ చుట్టూ బిగించి హత్య చేశాడు. ఆత్మహత్య చేసుకున్నట్లు నమ్మించేందుకు ఆమె మెడకు నైలాన్‌తాడు చుట్టి ఇంటి స్లాబ్‌కు కట్టాడు. పుస్తెలతాడు తీసుకొని గంగాధరలోని ఓ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టి డబ్బు తీసుకుని అప్పులు తీర్చాడు. ఈక్రమంలో పోలీసులు లోతుగా విచారణ చేయగా అసలు విషయం బయటపడింది. శనివారం నిందితుడు మోటారుసైకిల్‌పై పారిపోతుండగా చెప్యాల ఎక్స్‌రోడ్ వద్ద అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడితో పాటు అతడి తల్లిదండ్రులు, తమ్ములపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో మల్యాల సీఐ రవి, కొడిమ్యాల ఎస్సై సందీప్ పాల్గొన్నారు.

# పిల్లలతోపాటు తల్లిదండ్రులూ కోర్టుకు!

### మైనర్ డ్రైవింగ్ విషయంలో పోలీసులు సీరియస్

### ఉల్లంఘనులు సైతం జువెనైల్ బోర్డులో హాజరు

### భారీగా జరిమానాలు విధిస్తున్న న్యాయస్థానం

హైదరాబాద్: నగరంలో మైనర్ డ్రైవింగ్ నిరోధంపై దృష్టి పెట్టిన ట్రాఫిక్ విభాగం అధికారులు ఈ ఉల్లంఘనకు పాల్పడిన మైనర్లతో పాటు వారి తల్లిదండ్రులు (వాహన యజమానులైతే)/వాహన యజమానిపై చర్యలు తీసుకుంటున్నారు. మైనర్లను జువెనైల్ బోర్డు ఎదుట హాజరుపరుస్తున్న ట్రాఫిక్ విభాగం అధికారులు, తల్లిదండ్రులు/వాహన యజమానిని సాధారణ కోర్టుకు తరలిస్తున్నారు. దీనికి ముందు ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో (టీటీఐ) వీరికి పూర్తిస్థాయిలో కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు హైదరాబాద్ నగర ట్రాఫిక్ చీఫ్ జోయల్ డెవిస్ 'సాక్షి'కి తెలిపారు. మైనర్ డ్రైవింగ్‌పై ట్రాఫిక్ విభాగం అధికారులు గత నెల 5 నుంచి స్పెషల్ డ్రైవ్స్ చేస్తున్నారు. శనివారం వరకు నిర్వహించిన తనిఖీల్లో 2,067 మంది మైనర్లు డ్రైవింగ్ చేస్తూ చిక్కారని, వీరిపై కేసులు నమోదు చేశామని జోయల్ డెవిస్ పేర్కొన్నారు. వాహనాలను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు మైనర్‌తో పాటు తల్లిదండ్రులు/వాహన యజమానిని టీటీఐకి రప్పిస్తున్నారు. అక్కడ కౌన్సెలింగ్ ముగిసిన తర్వాత అభియోగపత్రాలు సిద్ధం చేసి మైనర్‌ను జువెనైల్ జస్టిస్ బోర్డు ముందు, తల్లిదండ్రులు/వాహన యజమానిని సంబంధిత కోర్టులో హాజరుపరుస్తున్నారు. న్యాయమూర్తులు మైనర్లకు సామాజిక సేవ వంటి శిక్షలు విధిస్తుండగా... తల్లిదండ్రులు/వాహన యజమానులకు భారీ జరిమానాలు వేస్తున్నారు. మోటారు వాహనాల చట్టం ప్రకారం వీరికి గరిష్టంగా మూడేళ్ల వరకు జైలుశిక్షపడే అవకాశం ఉందని అధికారులు చెప్తున్నారు. ఈ ప్రక్రియ ముగిసిన తర్వాత వాహనంతో పాటు ఆ మైనర్‌కు సంబంధించిన పూర్తి వివరాలను ఆర్టీఏ అధికారులు పంపిస్తున్నారు. వీటి ఆధారంగా ఆ విభాగం వాహనం రిజిస్ట్రేషన్‌ను ఏడాది పాటు రద్దు చేస్తోంది. సాధారణంగా 18 ఏళ్లు నిండిన వ్యక్తి మొదట లెర్నింగ్ లైసెన్స్, ఆపై శాశ్వత లైసెన్స్ తీసుకోవచ్చు.

నేను గైడ్ చేస్తా.. నేను గైడ్ చేస్తా అంటూ కళ్లముందు సూపర్ సక్సెస్ ఊరిస్తుంటే, ఎవరైనా వద్దంటారా? చూసీ చూడనట్టు ఊరుకుంటారా? నేర్చుకోవడానికి.. ఫాలో కావడానికి నేను రెడీ అంటూ ముందడుగేస్తారా? మిగిలిన వాళ్ల సంగతేమోగానీ... మురుగదాస్ మాత్రం ఈ విషయంలో ఒన్ స్టెప్ ఫార్వర్డ్ ఉన్నట్టే అనిపిస్తోంది. ఇంతకీ ఆయన ఏం చేశారు? అదీ సంగతి. రష్మికలో డ్యాన్సింగ్ టాలెంట్ ఇంత ఉందా? అని ఏ సినిమాకు ఆ సినిమా.. ఏ పాటకు ఆ పాట ఆశ్చర్యపరుస్తూనే ఉన్నాయి. సరిగ్గా దాన్నే అర్థం చేసుకున్నారు మురుగదాస్. ఇప్పుడు తాను చేస్తున్న సికందర్‌లోనూ ఆ విషయాన్నే హైలైట్ చేసేయాలని ఫిక్సయ్యారు. కెమెరా ముందు రష్మిక ఉంటే.. అటూ ఇటూ చూడటం ఎందుకనుకున్నారేమో.. ఆమె మీద సాంగ్స్ గట్టిగానే ప్లాన్ చేశారు. మామూలుగానే బాలీవుడ్‌లో పాటల చిత్రీకరణ గ్రాండ్‌గా ఉంటుంది. అందులోనూ ఇప్పుడు సికందర్ విషయంలో మరింత ప్రెస్టీజియస్‌గానే తీసుకున్నారనే విషయం ఇట్టే అర్థమైపోతోంది. ఈద్ కానుకగా సికందర్‌ని రిలీజ్ చేస్తున్నారు మురుగదాస్.

## రష్మిక కోసమే స్పెషల్ సాంగ్





## టాలీవుడ్‌పై ఆశలు పెట్టుకున్న అవికాగోర్

చిన్నారి పెళ్లి కూతురు సీరియల్ ద్వారా దక్షిణాది ప్రేక్షకులకు ఇష్టమైన నటిగా మారింది అవికా గోర్. బాలనటిగా బుల్లితెరపై సందడి చేసిన ఈ అమ్మడు.. ఇప్పుడు హీరోయిన్‌గా వెండితెరపై అలరిస్తుంది. ఈ అమ్మడి అందాలకు కుర్రాళ్ళు ఫిదా అవుతున్నారు. చిన్నారి పెళ్లి కూతురు సీరియల్ తో తెలుగు వారికి బాగా దగ్గరయ్యింది అవికా గోర్. చిన్నారి పెళ్లి కూతురు సీరియల్ తో తెలుగు వారికి బాగా దగ్గరయ్యింది అవికా గోర్. ఆ తర్వాత రాజ్ తరుణ్ నటించిన ఉయ్యాలా జంపాల సినిమాతో హీరోయిన్ గా వెండితెరకు పరిచయమైంది. ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఇందులో ఆమె నటనకు మంచి మార్కులు పడ్డాయి. సినిమా కూడా హిట్ కావడంతో వరుసగా అవకాశాలు వచ్చాయి. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ సినిమాలు చేసి మంచి గుర్తింపు తెచ్చుకుంది ఈ ముద్దుగుమ్మ. గత కొద్దిరోజులుగా అవికా గోర్ తెలుగు సినిమాలకు దూరంగా ఉంటుంది. బాలీవుడ్ లో ఎక్కువగా ఫోకస్ పెట్టింది. అక్కడ సినిమాలు, వెబ్ సిరీస్ లు చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. ఇక ఇప్పుడు తెలుగులో మరోసారి అదృష్టం పరీక్షించుకుంది. అది సాయి కుమార్ హీరోగా షణ్ముఖ అనే సినిమాలో నటించింది. హారర్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఆశించిన స్థాయిలో ఈ సినిమాలో ఆకట్టుకోలేకపోయింది. మరి ఈ సినిమా తర్వాత వరుసగా సినిమాలు చేస్తుందా లేదా అన్నది చూడాలి.

## డబుల్ ధమాకా



చిత్ర పరిశ్రమలోకి వచ్చి రెండు దశాబ్దాలు దాటినప్పటికీ బిజీగా దూసుకెళుతున్నారు త్రిష. తెలుగు, తమిళ, మలయాళ సినిమాలతో ఫుల్ స్వింగ్‌లో ఉన్న త్రిష పుట్టినరోజు మే 4న. ఈ సందర్భంగా డబుల్ ధమాకాలా ఆమె నటిస్తున్న 'విశ్వంభర, థగ్ లైఫ్' సినిమాల నుంచి లుక్స్ రిలీజ్ చేశారు మేకర్స్. చిరంజీవి హీరోగా 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్న 'విశ్వంభర'లో త్రిష హీరోయిన్‌గా నటిస్తున్నారు. విక్రమ్ రెడ్డి సమర్పణలో వంశీకృష్ణా రెడ్డి, ప్రమోద్ ఉప్పలపాటి నిర్మిస్తున్నారు. ఆదివారం త్రిష పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాలో ఆమె నటించిన అవని పాత్ర లుక్‌ను రివీల్ చేశారు. అదే విధంగా కమల్‌హాసన్ హీరోగా మణిరత్నం దర్శకత్వం వహించిన 'థగ్ లైఫ్' సినిమాలో త్రిష హీరోయిన్‌గా నటించారు. ఈ మూవీ నుంచి త్రిషపోస్టర్‌ని, అలాగే తొలి సింగిల్ 'జింగుచు...' పాటను కూడా విడుదల చేశారు. ఏఆర్ రెహమాన్ స్వరపరచిన ఈ పాటకు అనంత్ శ్రీరామ్ సాహిత్యంగా అందించగా, శ్రీకృష్ణ, మంగ్లీ, ఆశిమా మహాజన్, వైశాలీ సామంత్ ఆలపించారు. ఈ సినిమా జూన్ 5న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది.

## బాలీవుడ్‌కి మీనాక్షి?

'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో ఈ ఏడాది ప్రారంభంలో మంచి హిట్‌ను తన ఖాతాలో వేసుకుంది అందాల తార మీనాక్షి చౌదరి వరుస సినిమాలతో తెలుగు ప్రేక్షకులను మురిపిస్తోన్న ఈ భామ.. ఇప్పుడు బాలీవుడ్‌లో తన నటనను నిరూపించుకోవడానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. 'స్త్రీ', 'మిమీ' లాంటి హిట్ చిత్రాలను నిర్మించిన దినేశ్ విజన్ రూపొందిస్తున్న ఓ ప్రాజెక్టులో మీనాక్షి ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. "దక్షిణాదిలో జోరు చూపిస్తున్న మీనాక్షి కోసం నిర్మాణ సంస్థ మడాక్ ఫిల్మ్స్ ప్రత్యేకంగా కథను సిద్ధం చేస్తుంది. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా తీర్చిదిద్దుతున్న ఈ సినిమాలో ఆమె పాత్ర శక్తిమంతంగా ఉండనుంది. మీనాక్షి స్క్రీన్ ప్రెజెన్స్, నటనా సామర్థ్యాన్ని దృష్టిలో పెట్టుకొని చిత్రబృందం తనకు సరిగ్గా సరిపోయే హీరోను వెతికే పనిలో పడింది. మరికొన్ని రోజుల్లో ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించనున్నార"ని మీనాక్షి సన్నిహిత వర్గాలు తెలిపాయి.





## రిలీజ్ డేట్ ఎప్పుడు?

"ఇవాళ నా పుట్టినరోజు... ఎవరొచ్చినా లోపలికి పంపించు" అంటూ వచ్చేవాళ్లు చెప్పే శుభాకాంక్షల కోసం ఎగ్జయిటింగ్‌గా ఎదురు చూశారు దర్శకుడు శ్రీరామ్ వేణు. అయితే వచ్చిన లయ, స్వసిక విజయన్, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ 'సినిమా ఎప్పుడు రిలీజ్ చేస్తారు? ప్రమోషన్స్ ఎప్పుడు మొదలుపెడతారు? చెబుతారా చెప్పరా?' అంటూ కాస్తంత కోపంగా అడగడంతో, శ్రీరామ్ వేణు ఖంగు తిన్నారు. పైగా బేబీ శ్రీరామ్ దీత్య అయితే 'నేను థర్డ్ క్లాస్‌లో ఉన్నప్పుడు మూవీ స్టార్ట్ చేశారు, ఇప్పుడు ఫిఫ్త్ క్లాస్ చదువుతున్నా, మూవీ రిలీజ్ డేట్ ఎప్పుడు?' అని అడగడంతో, బర్త్‌డే విషెస్ చెబుతారని ఆశిస్తే, ఇలా షాక్ ఇచ్చేరేంటి అనుకుంటూ సర్ది చెప్పి, పంపించేస్తారు. చివరికి నిర్మాతలు 'దిల్' రాజు, శిరీష్ నవ్వుకుంటూ... శ్రీరామ్ వేణుతో, రిలీజ్‌ది ఏముందీ? కేక్ కట్ చేద్దువుగాని అంటూ, జూలై 4న థియేటర్లలో 'తమ్ముడు' అని రాసి ఉన్న కేక్‌ని కట్ చేయించారు. నితిన్ హీరోగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో 'దిల్' రాజు, శిరీష్ నిర్మించిన చిత్రం 'తమ్ముడు'. లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రలు చేశారు. ఆదివారం (మే 4) శ్రీరామ్ వేణు బర్త్ డే సందర్భంగా పైన పేర్కొన్న విషయాలతో తయారు చేసిన ఓ ఫన్నీ వీడియో ద్వారా సినిమాని జూలై 4న రిలీజ్ చేయనున్నట్లు పేర్కొన్నారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.